www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

చాళుక్య ద్వారము
తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య బట్టు గంగారావు
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక : 5 | 02-11-2020 | పుటలు : 4

# ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

## చిహ్నం - సందేశం

**సూర్యోదయం** :

నిర్మలమైన నీలిమేఘాల మధ్య ఉషోదయం !

**ఉదయిస్తున్న సూర్యుడు వికసిస్తున్న విద్యార్థికి ప్రతీక.** చదువుల్లో వెలుగై , విలువల్తో రాణించి సమాజానికి ఉపయోగపడే విద్యార్థిలోకం తరగతి గదుల్లో నిర్మాణం కావాలనే ఆశయానికి సంకేతం !!

**వలయాలు** :

భారత జాతీయ పతాకంలోని మూడు వర్ణాలు - మొదటి వలయం. అందులో శిరోభాగాన అశోకుని ధర్మచక్రం. ఒకరోజు మనిషి పరిశ్రమకు కాలచక్రంలో 24 గంటలు - ధర్మచక్రంలో 24 ఆకులు . చక్రం పారిశ్రామిక వృద్ధికి సంకేతం. చక్రం మానవ ప్రగతికి చిహ్నం. కాల స్వరూపం. అశోకుని ధర్మచక్రం చివరికి ధర్మమే, సత్యమే జయిస్తుందనే సంబోధనను కలిగి ఉంది.

రెండవ వలయం చతుష్షష్టి కళలకు ప్రతీక. 64 పుష్పాలు - 64 కళలు. సంగీతం, కవిత్వం, శిల్పం, చిత్రలేఖనం, నాట్యం, క్రీడలు, చదరంగం, గణితం, యంత్ర జ్ఞానం, నిర్మాణాలు, శాస్త్ర పఠనం . . . . . మొదలైన 64 కళలు మనిషిని మనీషిగా (బుద్ధిమంతునిగా), పరమానంద స్వరూపునిగా తీర్చిదిద్దుతూ సంతృప్తిని, ప్రశాంతతను అందిస్తున్నాయి. ఎరుపు, ఆకుపచ్చ, ముదురునీలం ప్రాథమిక వర్ణాలు. జాతీయ పతాకాన్ని ప్రతిబింబిస్తున్నాయి. వాటి నడుమ తెలుగు, ఆంగ్ల భాషలలో విశ్వ విద్యాలయం పేరు దర్శనమిస్తోంది.

**బోధివృక్షం (రావిచెట్టు)**

అది ఆధ్యాత్మిక సంకేతం. బుద్ధుని జ్ఞానోదయానికి, అష్టాంగ మార్గ బోధనకు వేదిక. దాని కాండ భాగం ఒకటి చిన్ముద్ర. మూడు వ్రేళ్ళు - మనసా, వాచా, కర్మణా ఆచరించగలిగితే తర్జని (చూపుడు వేలు) , అంగుష్ఠం (బొటనవ్రేలు) లో కలసి ఆత్మ - పరమాత్మ అభేదాన్ని సాధించి అద్వైత తత్వంతో మనిషి మహాత్ముడై దైవత్వం స్థాయికి చేరుతాడని తెలియజేస్తూ , ఆ సారాంశాన్ని గురువు శిష్యునికి అందించటం దానిని విద్యార్థి తన చేతితో అందుకోవటం కనిపిస్తుంది. జ్ఞానం నిరంతర సముపార్జనమైంది. తరగతి గదుల్లో మెల్లగా మొదలైన చదువు అత్యుత్తమ గ్రంథ పఠనంతో , లౌకిక పరిజ్ఞానంతో, పరిశోధనలతో, అనుభవంతో రాణించి పరిపూర్ణ మానవ వికాసానికి కారణమవుతుంది. ఆ చెట్టుకున్న ఆకులు కొన్ని లేత, కొన్ని ముదురు పచ్చని, కొన్ని పరిపక్వమై పండిన రంగులో కనిపిస్తూ మనిషి విజ్ఞాన స్థాయిలను తెలియజేస్తున్నాయి. అంతేకాక పర్యావరణ హితమైన వృక్షజాతికి రావిచెట్టు సంకేతం.

**చాళుక్య ద్వారం**

రాజమహేంద్రపురాన్ని రాజధానిగా చేసుకొని ఆంధ్రదేశాన్ని పరిపాలించిన తూర్పు చాళుక్యుల కోటలోనికి ప్రవేశించే మార్గం చాళుక్య ద్వారం. అది వారి నిర్మాణ కళకు చాళుక్య శిల్పానికి తార్కాణంగా చాళుక్య భీమవరపు కోట (సామర్లకోట), దక్షారామ భీమేశ్వరాలయాల నిర్మాణాలలో కనిపిస్తుంది. ఆ నమూనాను విశ్వవిద్యాలయ ప్రవేశ ద్వారంగా నిర్మించి విశ్వవిద్యాలయస్థలాన్ని 'రాజరాజ నరేంద్ర నగర్' గా నామకరణం చేశారు. ఆ ద్వారంలోంచి ఒక ప్రగతి పథం, పర్వత ప్రాంతంలో సహజమైన ఎర్రనేల వృక్ష సంపదకు ఆవాసంగా కన్పిస్తాయి.

**నదీతీరం**

పావన గోదావరి నదికి తూర్పు ముఖం రాజమహేంద్రి నగరం. పుణ్యగోదావరి గౌతమీగంగలో స్నానమాచరించి, నీటిని తీసుకొని పైకి వస్తాం. అవిగో నాలుగు మెట్లు. ధర్మార్థ కామ మోక్షాలనే చతుర్విధ పురుషార్థాలు !

**ధర్మబద్ధమైన జీవితం - ప్రవర్తన**
**ధర్మబద్ధమైన అర్థం - సంపాదన**
**ధర్మబద్ధమైన కాంక్ష - గృహస్థాశ్రమం**

ఈ మూడు ధర్మబద్ధమైనపుడు మోక్షం సాకారమౌతుందని జీవితానికి ఒక సరైన దారి ఏర్పడుతుందని సందేశం.

**పూర్ణకుంభం**

పూర్ణకుంభం ఆంధ్రుల రాజ చిహ్నం. కలశం భగవద్రూపం. పూర్ణకుంభం పరిపూర్ణ వ్యక్తిత్వానికి ఉదాహరణ. దాని మీద ఉన్న మూడుగీతలు బాల్యం, యౌవనం, వార్థక్యం - మనిషి జీవితం ! కమలం విజ్ఞాన వికాసాలకి ప్రతీక. సూర్యోదయానికి వికసించిన కమలం జ్ఞాన సముపార్జనతో విజ్ఞాని అవుతున్న విద్యార్థికి ప్రతీక !

**తాళపత్రం**

సమస్త భారతీయ ప్రాచీన వాఙ్మయం తాళపత్ర లిఖితమై ఉంది. చతుర్వేదాలతో సమంగా మహాభారతాన్ని పంచమ వేదంగా, విజ్ఞాన సర్వస్వంగా భారతీయులు గౌరవించారు. ఐదు తాళ పత్రాలు ఐదు వేదాలకు ప్రతీకలు. సంస్కృత మహాభారతాన్ని అష్టాదశ (18) పర్వాలుగా విభజించి రెండున్నర పర్వాల రచనతో తెలుగు కవిత్వానికి ఆద్యుడయ్యాడు నన్నయ భట్టారకుడు. దానికి గౌతమీ తీరం వేదికైంది . నిత్య సత్యవచనుడైన నన్నయ పేరుతో విశ్వవిద్యాలయానికి నామకరణం జరిగింది. ఆ తాళపత్రంపై ఒక సూక్తివాక్యం - **'సర్వత్ర విద్యయా వర్థతే ప్రజా'** విద్యను అన్ని తావుల అందించ గలిగితే సమస్త జనులు అభివృద్ధి చెందుతారనేది ఆ వాక్య సారాంశం !!

**ఆశయం**

శ్రమలో, కర్తవ్యంలో, బోధనలో, శోధనలో, విద్యలో, వినయంలో మనిషికి లౌకిక, ఆధ్యాత్మిక సందేశాన్నిస్తూ విద్యా పరిపూర్ణత్వాన్ని గోచరించే రూపంలో విశ్వవిద్యాలయచిహ్నం మనకు ఆహ్లాదంగా దర్శనమిస్తుంది. చిహ్నంలోని ప్రతీకల ద్వారా సమున్నత సందేశాన్ని అందిస్తోంది.

**ఆ సారాంశాన్ని అందిపుచ్చుకొని ఆచరించటమే మన కర్తవ్యం !!**

విశ్వవిద్యాలయ చిహ్నం రూపకల్పన
**ఆచార్య పసలపూడి జార్జ్ విక్టర్**
నన్నయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతులు,(2012 - 2015)
(తత్వశాస్త్ర విభాగం - ఆంధ్ర విశ్వవిద్యాలయం)

సాంకేతిక సహకారం
**శ్రీ జనా చంద్రశేఖర్**
జూనియర్ అసిస్టెంట్ - నన్నయ విశ్వవిద్యాలయం

## సంపాదకీయం



# వారధి

గోడలు కాదు కట్టుకోవలసింది – 'వంతెనలు' అన్నారో కవి. అవును. గోడలు విభజిస్తాయి. వంతెనలు కలుపుతాయి. వారధి రెండు ప్రాంతాల అభివృద్ధికి, సంబంధ బాంధవ్యాలకు పునాది. ప్రయాణం సుఖవంతమవుతుంది. సమయం సద్వినియోగం అవుతుంది. రాకపోకలకు, సరుకు రవాణాకు తేలికవుతుంది. ప్రాంతాలు కలిసేసరికి ప్రగతి వేగవంతమవుతుంది.

చదువుకున్న తరగతి గదులు, పాఠాలు చెప్పిన మాష్టార్లు, నడచిన వరండాలు, సేదతీరిన చెట్టకొమ్మలు, వెలుగు నిచ్చిన పుస్తకాలు . . . ఇవే చదువుకున్న విద్యార్థుల జీవితాల్లో నిండిపోయిన జ్ఞాపకాలు. ఎవరికైనా అంతే. చిన్నబడి, పెద్ద కళాశాల, లేదంటే విశ్వవిద్యాలయం . . ఏదైనా ఒకటే. అక్కడ చదువుకున్న విద్యార్థులుగా ఆ జ్ఞాపకాలు అందరికీ చాలా ఆనందాన్నిస్తాయి. అక్కడ జరుగుతున్న అభివృద్ధి, విశేషాలు తెలుస్తుంటే ఇంకా సంతోషం కలుగుతుంది. చదువుల చెట్టుక్రింద ఒక కాలంలో గడపటంవలన కదా మిత్రులయ్యాం. విద్యాలయం అనే గొప్ప అనుభూతినిస్తుంది. చిటెకెడు నవ్వుల గంధం , గుప్పెడు వెన్నెల రజను, దూరంగా కొండల మీద కనిపించే మూరెడు ఇంద్రధనుస్సు, దోసెడు గోదావరి నీళ్ళు కలిపి తయారు చేసిన శిల్పం – విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న రోజుల జ్ఞాపకం ! ఆ జ్ఞాపకం మనసుకు హాయిని గొలిపే మరో ప్రపంచం !!

మనం ఏది విత్తుతామో అదే మొలుస్తుందనేది ప్రకృతి సూత్రమైతే మనిషికీ అదే వర్తిస్తుంది. మన చదువులు, పుస్తకాలు, మాష్టార్లు మన భవిష్యత్ సౌధానికి పునాది.

ఇదిగో – **"నన్నయ వాణి"** విద్యార్థులకు –

విశ్వవిద్యాలయానికి ఒక వారధి. విజ్ఞాన ప్రపంచానికి ధీనిధి. ప్రగతి ప్రయాణానికి సారధి. విద్యా సమాచారాలకు సన్నిధి.

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్యాంపస్‌లు, అనుబంధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు, ఉభయ గోదావరి జిల్లాల్లోని విద్యావేత్తలు, మేధావులు విలువైన సమాచారాలను నన్నయవాణి వారపత్రికకు అందించగలరు. హేతుబద్ధమైన సమాచారాన్ని ప్రచురించేందుకు ప్రయత్నిస్తాం. సమాచారాన్ని డిటిపి రూపంలో పంపించి సహకరించగలరు.

ఈ.మెయిల్ : nannayavani@aknu.edu.in

# అంతర్జాతీయ ఐఈఈఈ వర్క్ షాప్


## వీసీ మొక్కా జగన్నాథరావు



అంతర్జాతీయ వర్క్ షాపు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ

**మీడియా సెల్, 29.10.20 :** ఐఈఈఈ కామ్ సొక్ బెంగళూరు మరియు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సి.ఎస్.ఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ వర్క్ షాపును సద్వినియోగం చేసుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం రెండు రోజుల అంతర్జాతీయ వర్క్ షాపు కు సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్(ఐఈఈఈ) మరియు ఆదికవి నన్నయ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నవంబర్ 13,14 తేదిలలో అంతర్జాతీయ వర్క్ షాపును నిర్వహిస్తున్నామని అన్నారు. "రిసెర్చ్ మెథడాలజీ అండ్ ఐఈఈఈ అథార్షిప్ ల్యాబ్" అనే అంశంపై జరిగే రెండు రోజుల అంతర్జాతీయ సదస్సుకు అర్గనైజర్ అండ్ కన్వీనర్ గా సి.ఎస్.ఈ అధ్యాపకురాలు, ఐఈఈఈ మెంబర్ టి.త్రిత్వజ్యోతికిరణ్ వ్యవహిరిస్తున్నారని తెలిపారు. అంతర్జాతీయంగా ఇంజనీరిగ్ విభాగంలో ఆధునిక సాంకేతిక వినూత్న పరిశోధనలకు కేంద్రమైన ఐఈఈఈ సోసైటీతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తొలిసారిగా అంతర్జాతీయ వర్క్ షాపును నిర్వహిస్తుందని అన్నారు. నేటి తరానికి అవసరమైన ఇంజనీరింగ్ పరిశోధనలకు సంబంధించి అనేక నూతన అంశాలను దీనిలో చర్చించడం జరురుగుతుందని తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన పీజీ విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు దీనిలో రిజిస్ట్రేషన్ చేయించుకొని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ అంతర్జాతీయ వర్క్ షాపులో పాల్గొన్న వారికి ప్రతిష్టాత్మకమైన ఐఈఈఈ సర్టిఫికెట్టును కూడా అందించడం జరుగుతుందని అన్నారు. కాబట్టి అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని వీసీ సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు మాట్లాడుతూ ఐఈఈఈ వంటి అంతర్జాతీయ సొసైటీతో సి.ఎస్.ఈ విభాగం సంయుక్తంగా రెండు రోజుల వర్క్ షాపు నిర్వహించడం అభినందించదగిన విషయమని అన్నారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్, విభాగాధిపతి డా.పి.వెంకటేశ్వరరావు, వర్క్ షాపు కన్వీనర్ టి.త్రిత్వజ్యోతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యలో సాంకేతిక పరిజ్ఞానంపై వెబినార్



వెబినార్ బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

**మీడియా సెల్, 30.10.20 :** "విద్యాలో సాంకేతిక పరిజ్ఞానం – అనుకులతలు, పర్యావసానాలు" అనే అంశంపై నవంబర్ 11,12 తేదిలలో జాతీయ వెబినార్ ను నిర్వహిస్తున్నామని దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో రెండు రోజుల వెబినార్ కు సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించారు.

దీనిపై వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యా కళాశాల అధ్వర్యంలో నవంబర్ 11,12 తేదిలలో జాతీయ వెబినార్ ను నిర్వహిస్తున్నారని అన్నారు. దీనికి చైర్మన్ గా ప్రిన్సిపాల్ ఆచార్య కె.సుబ్బారావు, కన్వీనర్ గా కోర్సు కోఆర్డినేటర్ డా.జి.ఎలీషాబాబు వ్యవహరిస్తున్నారని తెలిపారు. విద్యలో సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి ఆచార్య కె.పి.సుబ్బారావు, ఆచార్య కె.పుష్పానందం, ఆచార్య బి.రమేష్ బాబు, డా.వి.పెర్సిస్ లు ఉపన్యాసాలు అందిస్తారని అన్నారు. ఉపాధ్యాయ విద్యకు సంబంధించిన అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ వెబినార్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, విద్యాశాఖ ప్రిన్సిపాల్ ఆచార్య కె.సుబ్బారావు, కన్వీనర్ డా.జి.ఎలీషాబాబు, కోకన్వీనర్లు ఆర్.సాంబశివరావు, డా.ఎం.గోపాలకష్ణ, జె.రాజమణి, డా.ఎన్.సుజాత, కె.ఎస్.ఆర్.రాజేశ్వరిదేవి పాల్గొన్నారు.




## భారతీయ విశేషాలు

భారతదేశం అతి పురాతనమైనది ఇక్కడ వివిధ రకాల మతాల వారు జీవిస్తున్నారు పురాతన కాలం నుంచి వివిధ రకాల ఆచారాలు సంప్రదాయాలు వారసత్వంగా ఇప్పటికి మనం పాటిస్తున్నాము. ఎందరో మహానుభావులు మన భారతదేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలల తెలియజేశారు. మన దేశం ఇతర దేశాలతో పోటీ పడుతుంది అంటే వారి యొక్క త్యాగం అని చెప్పవచ్చు. మీకు తెలియని వాస్తవాలు కొన్నింటిని మనం తెలుసుకుందాం..!

**1. తేలియాడే పోస్ట్ ఆఫీస్ :** ప్రపంచంలో అతిపెద్ద పోస్ట్ ఆఫీస్ నెట్ వర్క్ మన దేశంలోనే ఉంది. దాదాపు 1,55,015 పోస్ట్ ఆఫీస్ లు మనదేశంలో ఉన్నాయి ఒక పోస్ట్ ఆఫీస్ సగటున 8,000 మందికి పైగా సేవలు అందిస్తున్నాయి వాటితో పాటు నీటిలో తేలియాడే పోస్ట్ ఆఫీస్ ను శ్రీనగర్ , దాల్ సరస్సు లో 2011 లో ఈ తేలియాడే పోస్ట్ ఆఫీస్ ను నిర్మించారు.

**2. కుంభమేళా 2011 :** కుంభమేళ 2011 దానికి ఒక ప్రత్యేకత ఉంది ఆ కుంభమేళ లో దాదాపు 75 మిలియన్ల మంది పాల్గొన్నారు. ఆ జనాభా మొత్తం అంతరిక్షం నుండి కూడా కనిపించారు.

**3.ప్రపంచంలో అత్యంత తేమగా ఉండే ప్రదేశం :** ప్రపంచంలో అత్యంత తేమగా ఉండే ప్రదేశం భారతదేశంలో మేఘాలయలోని ఖాసి కొండలు అని చెప్పవచ్చు. అక్కడ ప్రపంచంలో కంటే అత్యంత అధిక వర్షపాతం అక్కడే నమోదు అవుతుంది, ఆ తర్వాత చిరపుంజి లో నమోదు అవుతుంది, అందుకే ఆ ప్రాంతం ఎప్పుడూ తేమగా ఉంటుంది.

**4. చంద్రుడు పై నీటిని కనిపెట్టిన దేశం మన భారత దేశం:** 2009 సెప్టెంబర్ లో భారతదేశం ప్రయోగించిన చంద్రయాన్-1 చంద్రునిపై నీరు ఉందని మొదటిసారిగా కనుగొన్నది.

**5. స్విజర్లాండ్ సైన్స్ డే :** స్విట్జర్లాండ్ ప్రభుత్వం తమ సైన్స్ డే ను మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆజాద్ కీ అంకితం చేశారు అయినా 2006 మనదేశంలో క్షిపణి లను ప్రయోగించిన తర్వాత ఆ దేశాన్ని సందర్శించారు దానికి గుర్తుగా స్విజర్లాండ్ సైన్స్ డే మే 26 అని ప్రకటించింది. **-ద్వారపూడి నాగేంద్రరెడ్డి**

## నన్నయ సూక్తి నిధి

**నుతజల పూరితంబులగు నూతులు నూటిటికంటె సూనృత**
**వ్రత ! యొక బావి మేలు, మఱి బావులు నూటిటికంటె నొక్క స**
**త్క్రతువది మేలు, తత్క్రతు శతంబునకంటె సుతుండు మేలు; త**
**త్సుత శతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్**
**(మహాభారతం 1-4-94)**

**తాత్పర్యం** నూఱు (100) నూతులు త్రవ్వించిన పుణ్యం కంటె ఒక పెద్ద బావి త్రవ్వించిన పుణ్యం గొప్పది. నూఱు బావులు కట్టించిన దానికంటె ఒక యజ్ఞం వలన కలిగిన పుణ్యం గొప్పది. అటువంటియజ్ఞాలు నూటికంటె కొడుకును పొందిన పుణ్యం గొప్పది. నూఱుగురు కుమారులకంటె ఒక **సత్యవాక్యము** శ్రేష్ఠమైనది.

లోకంలో సత్యమే భగవంతుడు. సత్యంలోనే ధర్మం నిత్యంగా నిలచి ఉంటుంది. సర్వ జగత్తునకూ సత్యమే మూలం. సత్యం కంటె ఉత్తమ పదం మరొకటి లేదు.

## కదిలే కాలంతో పరుగు...



వీరేశలింగంగారు ఆనాడు అన్నారు చిరిగిన చొక్కా అయినా వేసుకో కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో అని..

అబ్దుల్ కలామ్ గారు చెప్పారు కలలు కనండి వాటిని సహకారం చేసుకోండి. సక్సెస్ అంటే మీ సంతకం ఆటోగ్రాఫ్ గా మారటమే అని...

ఇలా గొప్పవాళ్ళు ఎందరో మహానుభావులు విద్య గురించి, మనిషి గెలుపు గురించి గొప్పగా చెప్పారు.

నేను ఓ మధ్య తరగతి కుటుంబం నుండి వచ్చిన విద్యార్థినే. నన్నయ్య యూనివర్సిటీలో 2007-2009 ప్రాంతంలో M.Sc Organic Chemistry చదివి డిస్టిన్షన్లో పాస్ అయ్యాను. ప్రస్తుతం నేను విశాఖపట్నం నగర ప్రత్యేక శాఖ పోలీసు సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు.

చదవాలన్న సంకల్పం,గెలవాలన్న నా లక్ష్యం ఈరోజు నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. ఒక కళాకారుని గొప్పతనం ఒక శిల్పంలో కనిపించినట్లు, ఒక కవి గొప్పతనం మాటచాతుర్యంలో తెలిసినట్టు,ఒక గురువు గొప్పతనం విద్యార్థి గెలుపు లో కనిపిస్తుంది.

**స్ఫూర్తి**

విద్య నేర్చుకున్న ఎందరో మహనీయులు ఖండాలు చుట్టితిరిగి వస్తున్నా...విద్య నేర్పిన గురువులకు గుర్తింపు విద్యార్థి గెలుపు లో తప్ప మరెక్కడా దొరకదు.

నా గెలుపుకు నా కష్టం ఎంత ఉందో నాకు విద్య నేర్పిన గురువుల కషి కూడా అంతే ఉంది.ఆ నాడు నాకు విద్య నేర్పిన మా గురువు గారు డా.బి.జగన్మోహన్ రెడ్డి గారికి, అధ్యాకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

కదిలే కాలానికి పోటీగా పరుగులు తీస్తున్న ఈ తరుణంలో నేటి యువతకు నేను ఇచ్చే సలహా, సందేశం ఒక్కటే గెలుపోటములు అనేవి గాలికి ఎగిరే జెండా లాటిది ఏ దిక్కున ఎగురుతుందో ఎంత సేపు ఎగురుతుందో జెండాను నిలబెట్టిన కర్రకే తెలియదు ఊహించడానికి మనమెవరం. నేను చెప్పేదల్లా ఒక్కటే విశ్రమించకుండా కషి చేస్తే అస్తమించని విజయం మనదే సోదరా.!

జై హింద్...

**పూర్వవిద్యార్థి, సిహెచ్.హరికష్ణ,**
**విశాఖపట్నం నగర**
**ప్రత్యేక శాఖ పోలీసు సబ్ ఇన్స్పెక్టర్**

## మహిళలు శక్తి స్వరూపిణులుగా ఎదగాలి

**వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు**




**మీడియా సెల్, 28.10.20 :** మహిళలు శక్తి స్వరూపిణులుగా ఎదగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో మహిళ చట్టాలపై వెబినార్ నిర్వహించారు. "మహిళలపై నేరాలు - చట్టపరమైన దృక్పథం" అనే అంశంపై జరిగిన ఈ వెబినార్ కు కన్వీనర్ గా ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి వ్యవహరించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. భూమిని తల్లిగా భావించే భారత సంస్కృతిలో మహిళలు శక్తి స్వరూపిణులుగా ఉండాలని అన్నారు.

నేటి ఆధునిక సమాజంలో ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై అనేక దాడులు, వేధింపులు జరుగుతున్నాయని వీటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చట్టాలను ఆశ్రయించాలని తెలిపారు. చట్టాలపై మహిళలు పూర్తి అవగాహనను పెంపొందించుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. తరువాత రిసోర్స్ పర్సన్ రహిమున్నిస బేగం మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులు, దాడులు వంటి నేరాలకు చట్టపరమైన శిక్షలు ఏ విధంగా ఉంటాయి అనే అంశాలను వివరించారు. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన చట్టాలు, వాటి అమలు తదితర అంశాలను తెలియజేసారు. దీనిలో ఉభయగోదావరి జిల్లాల్లోని 290 ఎన్.ఎస్.ఎస్ యూనిట్లుకు చెందిన ప్రోగ్రామ్ అధికారులు, వాలంటీర్లు, విద్యార్థిని విద్యార్థులు అందరూ పాల్గొని వెబినార్ ను సద్వినియోగం చేసుకున్నారు. మహిళ చట్టాలపై చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన డా.బి.కెజియారాణిని రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి, ఈసీ మెంబర్లు ఆచార్య కొట్టి శ్రీరమేష్, డా.బి.జగన్మోహనరెడ్డి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మంచి మాట


**విద్యాదదాతి వినయం**
**వినయాద్యాతి పాత్రతాం ।**
**పాత్రత్వాద్ధన మాప్నోతి**
**ధనాద్ధర్మం తతస్సుఖం ॥**

-విద్యవలన వినయమును, దానివలన పాత్రతను, అందుమూలమున ధనాన్ని, దానివలన సుఖాన్ని నరులుపొందుదురు. విద్యయే పరమోత్తమమైనది.

# సాహిత్య ప్రయోగశీలి తిలక్

## అంతర్జాతీయ అంతర్జాల సదస్సులో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**మీడియా సెల్, 26.10.20 :** ఆధునిక తెలుగు సాహిత్యంలో కవిగా, రచయితగా, నాటకకర్తగా, వ్యాస రచయితగా భిన్న కోణాలలో సాహిత్య ప్రయోగశీలిగా శతవసంతాల పాటు తిలక్ సాహిత్యం వర్ధిల్లిందని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో శనివారం "ఆధునిక తెలుగు సాహిత్యం - తిలక్ వైశిష్ట్యం" అనే అంశంపై అంతర్జాతీయ అంతర్జాల సదస్సును నిర్వహించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ మరియు మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్తు అయితంపూడి సంయుక్త ఆధ్వర్యంలో 24వ తేది నుండి 26వ తేది వరకు మూడు రోజుల పాటు ఈ సదస్సు జరిగింది. దీనికి కన్వీనర్లుగా ఆచార్య రంకిరెడ్డి రామమోహనరావు, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ లు వ్యవహరించారు. ఈ అంతర్జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. దీనిలో వీసీ మాట్లాడుతూ ఇది తిలక్ శతజయంతి సంవత్సరమని తన రచనలతో ఆధునిక తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన అనుభూతివాద కవి తిలక్ అని కొనియాడారు. కవులకు, కళలకు పుట్టినిల్లు అయిన గోదావరి ప్రాంతంలో జన్మించి తన సాహిత్యంతో విశ్వనరుడుగా తిలక్ ఎదిగారని అన్నారు. చక్కటి కథలు, పాటలు, నాటికలు, నాటకాలు, లేఖలు, లఘు సాహిత్య వ్యాసాలు రాసిన గొప్ప అభ్యుదయ భావకవి తిలక్ అని చెప్పారు. వేయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో నూరు




అంతర్జాతీయ వెబినార్ లో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

వసంతాలను తన కవిత్వంతో అజరామరం చేసుకున్న అనుభూతివాద కవిగా తిలక్ తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వతుడుగా ఉన్నారని అన్నారు. అమృతం కురిసిన రాత్రి కావ్యానికి వీరి మరణానంతరం కేంద్రసాహిత్య అకాడమి పురస్కారం లభించిందని అన్నారు. నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయపారావతాలు, నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు, నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన ఆడపిల్లలు అంటూ తిలక్ సాహిత్యాన్ని స్మరించారు. రెండవరోజు ఆయా ప్రాంతాలకు చెందిన సాహిత్యవేత్తలు తిలక్ సాహిత్యంపై తమదైన శైలిలో ఉపన్యాసాలను అందించారు. మూడవ రోజు సోమవారం ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ బట్టు గంగారావు మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యంలో తిలక్ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని అన్నారు. తెలుగు సాహిత్యంలో అగ్రస్థానంలో నిలిచిన తిలక్ గోదావరి వాసి కావడం మనందరికి గర్వకారణమని తెలిపారు. మూడు రోజుల పాటు తిలక్ సాహిత్య వైశిష్ట్యంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించిన నిర్వహకులు కన్వీనర్లు ఆచార్య రంకిరెడ్డి రామమోహనరావు, డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ లకు రిజిస్ట్రార్ అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తిలక్ కుమారులు డా.దేవరకొండ సత్యనాయారణమూర్తి(ఇంగ్లాండ్), సుబ్రహ్మణ్యం, కుమార్తె యనమండ్ర చంద్రలేఖ, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు, బెంగళూరు విశ్వవిద్యాలయం ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్య పి.సుమతీ నరేంద్ర, బెంగుళూరు విశ్వవిద్యాలయం ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి, మద్రాసు విశ్వవిద్యాలయం ఆచార్య విస్తాలి శంకరరావు, ప్రముఖ కవయిత్రి డా.కె.గీత, వంగలహర్షవర్ధన్, డా.కలిదిండి రామచంద్రరాజు, డా.వత్సవాయి వెంకటరాజు, డా.రసరాజు, సినీ సంగీత దర్శకులు ఈవని సత్యనారాయణమూర్తి, డా.దేవరకొండ సత్యనారాయణమూర్తి, తెలుగు శాఖ అధ్యాపకులు డా.తలారివాసు, డా.తరపట్ల సత్యనారాయణ, డా.లక్ష్మీనరసమ్మ మరియు దేశ, విదేశాల నుండి తెలుగు సాహిత్య అభిమానులు, పరిశోధకులు పాల్గొన్నారు.

# నాక్ లో మంచి గ్రేడ్ సాధించాలి

## వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు

**మీడియా సెల్, 30.10.20:** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపులో మంచి గ్రేడ్ సాధించే దిశగా విశ్వవిద్యాలయ నాక్ కమిటీ సభ్యులంతా సమష్టిగా కషి చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయ నాక్ గుర్తింపుకు సబంధించి మెంటార్ యూనివర్సిటీగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో "పరామర్శ్ ప్రోగ్రామ్" అనే పేరుతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి నాక్ గుర్తింపు ఎంతో అవసరమని అన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వారి అనుభవాలను, సూచనలు, సలహాలు తీసుకొని త్వరితగతిన నాక్ గుర్తింపు సాధించాలని చెప్పారు. నాక్ గుర్తింపుకు అవసరమైన సెల్ఫ్ స్టడీ రిపోర్ట్ ను సమర్ధవంతంగా తయారు చేయాలని తెలిపారు. తరువాత నాక్ గుర్తింపుకు అవసరమైన అవగాహనను నిష్ణాతులైన సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రోవీసీ ఆచార్య బి.రాజశేఖర్, ఐక్యూఎసి డైరెక్టర్ ఆచార్య ఎస్.శ్రీనాథ్, నాక్ కన్సల్టెంట్ ఆచార్య వి.కష్ణమూర్తి వివరించారు. నన్నయ విశ్వవిద్యాలయ నాక్ గుర్తింపుకు అన్ని విధాల సహకారాలను అందిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, నాక్ కోఆర్డినేటర్ ఆచార్య కొట్టి శ్రీరమేష్, ఎగ్జిక్యూటీవ్ కోఆర్డినేటర్ డా.కె.వి.స్వామి ఈసీ మెంబర్ డా.బి.జగన్మోహనరెడ్డి, నాక్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మానసిక వికాసమే సమాజ వికాసం

**మీడియా సెల్, 29.10.20 :** ఆధునిక పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతత దూరమవుతుందని అనేక మంది మానసిక రుగ్మతులతో సతమతమవుతున్నారని దానికి భిన్నంగా మానసిక వికాసాన్ని పెంపొందించుకొని ఆరోగ్యకరమైన వాతావరణంలో జీవించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. విశ్వవిద్యాలయంలో గురువారం **స్పృహ** సైకాలజీ పూర్వ విద్యార్థుల సంఘం మరియు సైకాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నేషనల్ వర్క్ షాపును నిర్వహించారు. "కథ చెప్పే విధానం ద్వారా మానసిక సమతుల్యత మరియు ప్రశాంతత, మానసిక వికాసానికి విద్యాభివద్ధికి తోడ్పాటు" అనే అంశంపై జరిగిన ఈ వర్క్ షాపుకు కన్వీనర్ గా విభాగాధిపతి డా.పడాల రాజశేఖర్ వ్యవహరించారు. దీనికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు హాజరై ఉపన్యసించారు. కథలు చెప్పటం మన సంస్కతిలో భాగమని హరికథలు, బుర్రకథలు వంటి ఆనాటి సామాజీక, సాంఘిక, మానసిక, సంఘీభావానికి ప్రతీకలని అన్నారు. పిల్లలకు హితభోద చేయాడానికి, భావవ్యక్తీకరణకు కథలు ఎంతగానో దోహదపడేవని చెప్పారు. నేటి ఆధునిక ప్రపంచంలో మానసిక ఒత్తిళ్ళు అధికమై మానసిక రుగ్మతలకు లోనవుతున్నారని తెలిపారు. మానసిక రుగ్మతలను దూరం చేసి మానసిక వికాసాన్ని పెంపొందించి విద్యాపరమైన ప్రగతికి దానిని ఉపయోగించే విధంగా మానసిక నిపుణులు పాటుపడాలని చెప్పారు. సాంకేతిక ప్రగతిని మంచి మార్గంలో ఉపయోగించుకుంటూ మానసిక ప్రశాంతతో కూడిన



వర్క్ షాపులో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

మెరుగైన సమాజానికి మార్గనిర్ధేశం చేయాలని తెలిపారు. చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన సైకాలజీ విభాగాధ్యాపకులకు మరియు **స్పృహ** అధ్యాక్షులు సుంకర నాగేంద్రకిషోర్ కు వీసీ అభినందనలు తెలియజేసారు. త్వరలో అంతర్జాతీయ కమ్యునిటీ సైకాలజీ సదస్సు కూడా నిర్వహిచాలని సూచించారు. ప్రముఖ కథ రచయిత లావణ్య శ్రీనివాస్ మాట్లాడుతూ కథలు ద్వారా మానసిక స్థితిగతులలో కలిగేమార్పులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బట్టు గంగారావు, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరమేష్, కన్వీనర్ డా.పడాల రాజశేఖర్, కో.కన్వీనర్లు డా.మణిరమణ సి.వి.ఎస్, డా.ఎన్.వి.వి.ఎస్.నారాయణ, సిహెచ్.ఎన్.కె.భవాణి, సహ అధ్యాక్షులు సుంకర నాగేంద్రకిషోర్, ఎస్.రాజేష్ కన్న, జి.కిషోర్, నందెపు నాగేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్:- nannayavani@aknu.edu.in